పేద విద్యార్థులను నిరాశ పరిచారు



మాది నిరుపేద వ్యవసాయ కుటుంబం. బాగా చదువుతున్నానని మా తల్లిదండ్రులు డాక్టర్‌గా చూడాలని కోరికతో బైపీసీ తీసుకున్నాను. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాను. నీట్ రాసి మంచి ర్యాంకు ద్వారా మెడిసిన్ సీటు సాధించాలనుకున్నాను. ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ఏర్పాటై సీట్లు పెంచితే మాలాంటి నిరుపేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. నూతన వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి సీట్లు పెంచాల్సిన ప్రభుత్వం వాటిని రద్దు చేయాలని లేఖ రాయడం సరైనది కాదు. డాక్టర్లు అవ్వాలన్న మా కలను ప్రభుత్వం నిరాశ పరిచింది. మా ఆశలు అడియాశలు చేశారు.

- ఆర్. ప్రియదర్శిని, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల బైపీసీ విద్యార్థిని



ప్రైవేట్‌కు ఇవ్వొద్దు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరమైతే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట్ కోటాలో చేరుతాయి. దీని వల్ల పేదలకు మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వ కాలేజీలు అయితే పెద్దగా ఉంటాయి. రోగులు ఎక్కువ మంది వస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే బాగా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ యాజమాన్యాలకు ఇస్తే దీనికి భిన్నంగా పరిస్థితి ఉంటుంది. ప్రైవేట్ వారు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తారు. మేనేజ్‌మెంట్ కోటాలో వారు ఎంత చెబితే సీటుకు అంత చెల్లించాల్సి వస్తుంది.

- నలమారు రాంగోపాల్‌రెడ్డి, సైదాపురం

క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి సన్మానం

కోట: బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేసిన యాదాటి వెంకటేశ్వర శర్మ ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర శర్మ దంపతులను ప్రిన్సిపల్ నారాయణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పనిచేసి ఎందరో భావిభారత పౌరులను తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

పెళ్లకూరు: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం అర్ధమాల, నందిమాల గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతంగా చేపట్టి సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోగుతట్టు మురళి, నాయకులు నరసింహులు, సతీష్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడి పీఏసీఎస్ సమావేశం

కోట: రైతులకు సేవలందించే దిశగా తిన్నెలపూడి పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేయనున్నట్లు సీఈఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తిన్నెలపూడి పీఏసీఎస్ కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. కేవైసీ లేని సభ్యుల సభ్యత్వం రద్దు చేయడం, లావాదేవీల కంప్యూటరీకరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, సొసైటీ మాజీ డైరెక్టర్లు సురేంద్రరెడ్డి, శ్యాంసుందర్, మహేష్‌సింగ్, కోట డీసీసీబీ మేనేజర్ సాయికేశవరామ్ పాల్గొన్నారు.

ఉచ్చూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

దొరవారిసత్రం: ఉచ్చూరు గ్రామంలో విలేజ్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పురుషులు, మహిళలల్లో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ తదితర వాటిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య, డాక్టర్ పద్మావతి, సర్పంచ్ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, నాయకుడు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెళ్లకూరు ఎస్‌ఐగా నాగరాజు



పెళ్లకూరు: మండల ఎస్‌ఐగా కె.నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. డక్కిలి నుండి పెళ్లకూరుకు బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న శ్రీకాంత్ తిరుపతి వీఆర్‌కు వెళ్లడంతో పెళ్లకూరు ఎస్‌ఐగా నాగరాజు బాధ్యతలు చేపట్టి విధుల్లో చేరారు. దీంతో నాయుడుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంఘమేశ్వరరావు, సిబ్బంది ఎస్‌ఐని అభినందించారు.

సొసైటీల కంప్యూటరీకరణ

గూడూరు రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘాలను(పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేస్తున్నామని సహకార శాఖాధికారి రవి రాజశేఖర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని 24 సొసైటీలో శుక్రవారం మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి ఆన్‌లైన్ విధానంలో కోడ్‌లు ఇచ్చేలా చూస్తున్నామన్నారు.

వరద బాధితులకు సాయం



నగదు చెక్కును చూపుతున్న విద్యార్థులు

వాకాడు: సెయింట్ పాల్స్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం వరద బాధితుల సహాయార్థం రూ.20 వేలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ వై.సుమంత్ శుక్రవారం విద్యార్థులు అందించిన సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తడ: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్ జిల్లా పశ్వాడా గ్రామానికి చెందిన కమిల్ మాలిక్ ప్రస్తుతం తడలో నివాసం ఉంటున్నాడు. శ్రీసిటీలోని పరిశ్రమల నుంచి స్క్రాప్ కొనుగోలు చేసే ఓ సంస్థలో పని చేస్తున్నాడు. గురువారం చెన్నైలో ఉన్న తమ సంస్థ కార్యాలయం వద్దకు వెళ్లి వస్తున్న మాలిక్ అర్ధరాత్రి సమయంలో శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. సమీపంలో ఉన్నవారు గమనించి అతన్ని శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. మాలిక్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలిస్తుండగా మృతి చెందాడు.

కాలుష్య కోరల్లో కాళంగి

కాళంగి నదికి పొర్లుకట్టలా మున్సిపాలిటీ చెత్త



కాళంగి నది పరివాహక ప్రాంతంలోనే చెత్త డంప్



- ఓ వైపు చెత్త డంపింగ్.. మరోవైపు వినాయకుడి విగ్రహాల నిమజ్జనం
- కలుషితమైన పోయిన కాళంగి జలాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

సూళ్లూరుపేట: పట్టణానికి ప్రకృతి ప్రసాదించిన జలవనరుల్లో మొదటిది పులికాట్ సరస్సు. రెండోది కాళంగి నది. ఈ నదిలో స్వచ్ఛమైన నీళ్లుంటేనే బోర్లు, బావులకు భూగర్భం నుంచి మంచినీటిని అందుకోగలం. అలాంటి కాళంగి నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నప్పటికీ ఎవరికీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం కాళంగినది కాలుష్య కోరల్లో చిక్కుకుని నీళ్ల కలుషితమైపోయి విలవిల్లాడుతోంది. జిల్లాల్లోని కేవీబీపురం మండలం కాళంగి కొండల్లో పుట్టి కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలు మీదుగా వాటంబేడు వద్ద పులికాట్ సరస్సులో కలుస్తుంది. ఆంధ్రా–తమిళనాడు రాష్ట్రాలకు ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు కూడా కాళంగి నదీ జలాల్లోని సుడిగుండం ద్వారా స్వయంభువుగా సూళ్లూరులో కొలువు దీరిన విషయం విదితమే. ఇక్కడి అమ్మవారిని దర్శించుకోవాలంటే చాలా మంది భక్తులు ఇప్పటికీ కాళంగి నదిలో స్నానాలు చేసిన అనంతరం దర్శనం చేసుకుంటుంటారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన కాళంగి నదిని పట్టించుకోకపోవడంతో కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. రోజు రోజుకు అత్యంత దారుణంగా తయారవుతోంది.

చెత్త డంపింగ్

ముఖ్యంగా మున్సిపాలిటీ నుంచి వెలువడే టన్నుల కొద్దీ చెత్తను కాళంగి నది అంచునే డంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం చెత్త డంపింగ్ ఒకవైపు పొర్లుకట్టలా తయారైంది. ఈ చెత్త అంతా కూడా కిందకు జారిపోయి నదిలో కలిసి అందులో నీళ్లు కూడా దుర్వాసన వస్తున్నాయి. ఈ సమస్య కాళంగి నదిని పట్టి పీడిస్తుంటే వినాయకచవితి విగ్రహాల సమస్య కొత్తగా వచ్చిపడింది. సూళ్లూరుపేట పట్టణంలోనే కాకుండా పరిసర ప్రాంత గ్రామాల వారు కూడా వినాయకుడి నిమజ్జనం కాళంగి నదిలోనే చేసేస్తున్నారు. నది నిండా నీళ్లు ఉండి, అవి ప్రవహిస్తుంటే వేసినా ఫరవా లేదు కాని చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్న నీటిలోనే వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయడంతో నది మరింత కలుషితమైపోయింది. వినాయకుడి విగ్రహాలకు వాడే రసాయనాలు, రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి భయంకరమైన రసాయనాలంతా కాళంగి నదిలో కలిసిపోయి నదిలోని నీరంతా కాలుష్యమై దర్శనమిస్తోంది. అమ్మవారి భక్తులు ఇక్కడ స్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి వెళుతుంటారు. ఈ కలుషితమైన నీటిలో స్నానాలు చేస్తే చర్మ రోగాలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఒకవైపు ప్రభుత్వాలు మట్టిబొమ్మలే పెట్టాలని ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలను ఎవరూ పాటించకుండా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నా పట్టించుకుంటున్న వారు కూడా లేకపోవడం విమర్శనీయం. మరోవైపు సూళ్లూరుపేట పట్టణం నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలు కూడా కాళంగి నదిలోనే కలిసిపోయి నదిని పాడు చేసేస్తున్నారు. ముఖ్యంగా చెత్త డంపింగ్, వినాయకుడి విగ్రహాలు నిమజ్జనాలు, పట్టణం నుంచి వెలువడుతున్న వ్యర్థాలు కాళంగి నదిని కలుషితం చేస్తున్నాయి. దీంతో ఈ నీళ్లు పులికాట్ సరస్సుకు చేరి పర్యావరణాన్ని దెబ్బ తీస్తోంది. ముఖ్యంగా మున్సిపాలిటీ నుంచి వెలువడే చెత్తలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా ఉన్నాయి. ఇవన్నీ కాళంగి ప్రవాహంలో కొట్టుకుపోయి పులికాట్ సరస్సుకు చేరుతుండడంతో భవిష్యత్తులో సరస్సుకు కూడా ముప్పు తప్పదని పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి కాళంగి నదిని కాలుష్య కోరల నుంచి కాపాడాలని కోరుతున్నారు.



శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం సమీపంలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనం

మునుస్వామిరెడ్డికి పరామర్శ



రాణియమ్మాళ్ మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

తడ: కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ఆంబాకం మునుస్వామిరెడ్డి సతీమణి రాణియమ్మాళ్(70) కారూరు గ్రామంలోని ఆమె స్వగృహంలో గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వచ్చిన వైఎస్ఆర్ సీపీ నాయకులు కూడా రాణియమ్మాళ్ మృత దేహానికి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి



సమీక్షిస్తున్న ఈఈ రవీంద్రబాబు, పక్కనే డీఈ రమణయ్య

నాయుడుపేట టౌన్: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు మండల ఏఈలతోపాటు గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని పంచాయతీరాజ్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గపరిధిలోని ఆరు మండలాలకు సంబంధించి గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కొత్తగా ప్రతిపాదనలు చేసిన ఉపాధి పనులు జరిగే ప్రాంతాలు, వాటికి కేటాయించిన నిధులు తదితర విషయాలను సైతం ఇంజినీరింగ్ కార్యదర్శులు తెలుసుకుని వివరాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబుక్‌ల నిర్వహణ తదితర విషయాలను సైతం తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యకమంలో పీఆర్ డీఈ బందిలి రమణయ్య, ఏఈలు పాల్గొన్నారు.

వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలి



వంటలు రుచి చూస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించే నిర్వాహకులు వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక తహసీల్దార్ శైలకుమారి అన్నారు. ఆమె శుక్రవారం ఆకస్మికంగా తల్లంపాడు గ్రామ పరిధిలోని జెడ్పీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వంట ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా చదువులు ఏ విధంగా సాగుతున్నాయో అడిగి విద్యార్థుల నుంచి వివరాలు రాబట్టారు. అనంతరం ఆమె జెడ్పీ పాఠశాలకు సమీపంలో నెర్రికాలువ పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మించిన దుకాణాన్ని పరిశీలించారు. ఈ దుకాణం తొలగించేందుకు చర్యలు చేపడుతామని తహసీల్దార్ తెలియజేశారు. ఆమె వెంట సర్వేయరు రామారావు, ఇరిగేషన్ ఏఈ కస్తూరయ్య ఉన్నారు.

ఉచితంగా టైలరింగ్ శిక్షణ



మహిళలకు టైలరింగ్ సామగ్రి పంపిణీ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో ఓ కేంద్రం వద్ద రాష్ట్రీయ సేవా సమితి(రాస్)అధ్వర్యంలో పాదుపు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ వి.నాగరాజు వెల్లడించారు. నాయుడుపేటలో శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రాస్ శిక్షణా సంస్థకు చెందిన డాక్టర్ సుధాకర్ రెడ్డి, హరిబాబు, ప్రాజెక్టు అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరికి నివాళి

నాయుడుపేట టౌన్: భారత కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి చిత్ర పటం వద్ద పలు సంఘాల నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. సుందరరామిరెడ్డి నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు. యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, సుబ్బారావు, సీఐటీయూ నాయకులు ముకుంద, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

పెళ్లకూరు: ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ హంజత్‌ఖాన్ తెలిపారు. విద్యుత్ తీగలు పునరుద్ధరణ పనుల చేపడుతున్న తరుణంలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పాలకేంద్రం సబ్ స్టేషన్ 132కేవీ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ ముని రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటగిరి టౌన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని మన్నారుపోలూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులు చేయనున్న దృష్ట్యా శనివారం ఉదయం 6.30 నుంచి 9.30 వరకు విద్యుత్ ఉండదని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట రూరల్, సూళ్లూరుపేట పట్టణం, తడ, దొరవారిసత్రం మండలాల్లో కూడా విద్యుత్ ఉండదని వారు తెలియజేశారు. విద్యుత్ అంతరాయానికి చింతిస్తూ ఆ సమయంలో వినియోగదారులందరూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు కోరారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంతో పాటు తుమ్మూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ పేర్నాటి వెంకటస్వామి తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

కండలేరులో 11.621 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవా రం నాటికి 11.621 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 807 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 170, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



పీడీలు, పీఈటీలకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్

నాయుడుపేట టౌన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిపే క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి. శేఖర్ సూచించారు. మండల విద్యావనరుల కేంద్రం సమీపంలో సంఘమిత్ర కార్యాలయం వద్ద శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి పీడీలు, పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం జరిపారు . ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీలలో అండర్–14, అండర్–17 విభాగాల్లో జరిగే క్రీడా పోటీల్లో ప్రతి విద్యార్థి పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండల స్థాయి క్రీడా పోటీలను నాయుడుపేట బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంఈఓ మునిరత్నం, హెచ్‌ఎం శాంతి వివరించారు.

పట్టాలు ఇచ్చారు... భూములు చూపించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

చిల్లకూరు: ఇరవై మూడేళ్ల క్రితం పట్టాలు ఇచ్చారని, ఇప్పటి వరకు భూమి చూపించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన భూములను సాగు చేసుకునే వీలు లేక ఇబ్బంది పడుతున్నామని ఉడతావారిపార్లపల్లి, కలవకొండ గ్రామాలకు చెందిన 8 మంది గిరిజనులు తహసీల్దార్ శ్రీనివాసులుకు విన్నవించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్‌ను కలిసిన వారు తమ కష్టాలను ఏకరువు పెట్టారు. 1989లో అప్పటి అధికారులు గిరిజన కుటుంబాల వారికి ఎనిమిది మందికి కలవకొండ రెవెన్యూ పరిధిలో భూములు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున డి–నమూనా పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఆ భూములు ఎక్కడ అనే విషయాన్ని ఇప్పటి వరకు చూపించలేదన్నారు. ఇప్పటికైనా ఆ భూములకు హద్దులు చూపించాలని తహసీల్దార్‌ను కోరారు. దీంతో ఆయన స్థానిక వీఆర్‌ఓను పిలిపించి ఆ భూముల స్థితిని పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని అన్నారు.

సమాచారం వెంటనే అందించాలి

గ్రామాలలో ఇసుక, సిలికా, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేసుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలకు తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్‌ఏ, వీఆర్‌ఓలతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాలలో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నందున దీనిపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి తరలింపు



పంబలేరులో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్

చిల్లకూరు: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మట్టి, గ్రావెల్, ఇసుకను అక్రమంగా తవ్వి తరలించేసి, సొమ్ము చేసుకుంటున్నారు. మూడు జేసీబీలు, ఆరు టిప్పర్లు అన్నచందాన పుడమి తల్లికి తూట్లు పెడుతున్నారు. శుక్రవారం పట్టపగలు పంబలేరులో అక్రమంగా జేసీబీలు పెట్టి ఇసుకను ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. దీనిపై అధికారులకు స్థానికులు సమాచారం అందించినా పట్టించుకున్న పాపాన పోలేదు. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని తాడి చెరువులో నీటిపారుదల శాఖాధికారులు, రెవెన్యూ అధికారులకు ఎలాంటి సమాచారం కూడా ఇవ్వకుండా హిటాచీలు పెట్టి టిప్పర్ల ద్వారా మట్టిని తవ్వి తరలించుకుపోతున్నారు. ఈ చెరువు కింద 1000 ఎకరాల వరకు పంటలు పండుతాయి. చెరువు విస్తీర్ణం సుమారు 51 ఎకరాల వరకు ఉంది. అందులో తమ ఇష్టం వచ్చినట్లు ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ ఏఈ సురేష్‌బాబును వివరణ కోరగా ఎస్‌ఈ నుంచి అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్, స్థానిక వీఆర్‌ఓను పంపి అనుమతులు తీసుకుని వచ్చి చూపించిన అనంతరమే తవ్వకాలు చేపట్టాలని ఆపించేశారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న మేనేజర్ బాలాజీ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని విశ్వం జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు హెచ్‌ఐవీ నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు నవజీవన్ ఆర్గనైజేషన్స్ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ సంపత్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాసులు, మహేష్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

వరద బాధితులకు సాయం



వరద బాధితులకు దుస్తులు తీసుకెళుతున్న వాహనం

గూడూరు రూరల్: విజయవాడ ప్రాంతంలో వరద ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆదుకునేందుకు డీఆర్‌డబ్ల్యూ కళాశాల యాజమాన్యంతోపాటుగా విద్యార్థినులు తమ సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. వారు అందించే రూ.లక్షతో పాటుగా విద్యార్థినులు సేకరించిన దుస్తులను శుక్రవారం వాహనంలో తరలింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ విజయవాడ ప్రాంతంలో పెద్ద ఎత్తున నీరు కాలనీల్లోకి ప్రవేశించడంతో నష్టపోయిన పేదలు, మధ్య తరగతివారిని ఆదుకునేందుకు తమ వంతుగా రూ.లక్షను అందిస్తున్నామని అలాగే విద్యార్థినులు ముందుకు వచ్చి తమకు తోచిన సాయం అందించడంతోపాటుగా దుస్తులు సేకరించి అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేష్, హనుమంతరావు, విద్యాసాగర్‌రావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలకు ఉపాధి

- కూలీల కడుపు కొడుతున్న టీడీపీ నేతలు
- పనులు పరిశీలించిన ఏపీడీ



యంత్రాలతో పనులు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏపీడీ వరప్రసాద్‌రావు

బాలాయపల్లి(సైదాపురం): ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించాల్సిన ఉపాధి పనులు కూలీలు లేకుండానే యంత్రాలతో నిర్వహించి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఉపాధి ఏపీడీ వరప్రసాద్‌రావు పనులు జరిగే ప్రదేశం వద్దకు వెళ్లి పనులు పరిశీలించి ఆగ్రహానికి లోనైనా ఘటన బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లను కాసులకు ఎర వేసి కూలీలతో నిర్వహించాల్సిన పనులు జేసీబీ సహాయంతో చేపట్టారు. దీంతో ఉపాధి పనులకు నమ్ముకున్న కూలీలకు అన్యాయం జరగడంతోపాటు ప్రభుత్వ నిధులకు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు విషయం తెసుకున్న ఏపీడీ వరప్రసాద్‌రావు సుబ్రమణ్యం గ్రామం వద్దకు చేరుకుని యంత్రాలతో జరుగుతున్న పనులు అడ్డుకొని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాకుండా ఈ విషయంపై సమాచారం అందుకున్న మీడియా ప్రతినిధులు ఘటనాస్థలం వద్దకు చేరుకుని కవరేజ్ చేస్తుండగా వారిపై కూడా టీడీపీ నేతలు దురుసుగా మాట్లాడుతూ దౌర్జన్యానికి దిగారు.